క్లుప్తంగా

లైసెన్స్ తప్పనిసరి



మాగనూర్: వాహనాదారులు ధ్రువీకరణ పత్రాలతోపాటు లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్ఐ మల్లేష్ కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. జీపులు, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దన్నారు. నెంబర్‌ప్లేట్‌లు లేని వాహనాలను సీజ్‌చేస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మరికల్: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్నభోజన బిల్లులను వెంటనే చెల్లించాలని బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, నాయకులు వేణు, కొండయ్య అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. 13 నెలలకు సంబంధించిన భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఏజెన్సీ నిర్వాహకులు అప్పులుచేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారని గుర్తుచేశారు. పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

11నుంచి శ్రావణవేద ప్రచారం

ఊట్కూరు: మండలంలోని ఆర్యసమాజ్ భవనంలో ఈ నెల 11నుంచి శ్రావణ వేద ప్రచారం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యసమాజ్ అధ్యక్షుడు కనకప్ప, ప్రధాన కార్యదర్శి దివాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రజలు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

డీఈఓకి సన్మానం

కృష్ణా: నూతన విద్యాధికారి అబ్దుల్ ఘనిని శుక్రవారం ఎంఈఓ వెంకటయ్య ఆధ్వర్యంలో అమీన్‌రెడ్డి, క్లస్టర్ హెచ్‌ఎం నిజాముద్దీన్, జీహెచ్‌ఎం రాజేశ్వర్ సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సరిహద్దులోని మండల పాఠశాలల అభివృద్ధికి కృషిచేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆయంలో ప్రత్యేక పూజలు

నారాయణపేట: పవిత్ర శ్రావణమాసం పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని మహాంకాళీ ఆలయంలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలతోపాటు గాజులు, పసుపు, కుంకుమలతో ఒడినింపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పేట వాసికి డాక్టరేట్

నారాయణపేట రూరల్: ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను పేటజిల్లా వాసికి దక్కింది. మండలంలోని అమ్మిరెడ్డిపల్లికి చెందిన రాజేందర్ ఈ గవర్నెన్స్ చేంజింగ్ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ స్టడీ ఆఫ్ మెడ్చెల్ మల్కాజ్‌గిరి అండ్ మహబూబ్‌నగర్ డిస్ట్రిక్స్ ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై చేసిన అ.ద్యాయనానికి గౌరవం దక్కింది. బాలకార్మికుడిగా పనిచేసి డాక్టరేట్‌కు ఎదగడం గ్రామస్తులు సైతం అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

నేడు ఆంజనేయస్వామి ఉత్సవాలు

మద్దూరు: మండల కేంద్రంలోని పాతబస్టాండ్ ఆంజనేయస్వామి ఉత్సవాలు శనివారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ముష్టి నర్సింహులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జల్దిఉరేగింపులో హనుమాన్ శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో ఆంజనేయస్వామి వారి జల్దిబిందే శనివారం ఉదయం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు.

రుణాలు చెల్లించండి

ధన్వాడ: దీర్ఘకాలిక రుణాలు సకాలంలో చెల్లించేలా సభ్యులు చొరవ చూపాలని డీసీసీబీ మేనేజర్ కల్పనారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పాలక మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీలో ఇప్పటి వరకు 444 మందికి రూ.1.34 కోట్లు రుణమాఫీ కింద డబ్బులు వచ్చాయని, ఇంకా 272 మందికి రావాల్సి ఉందన్నారు. అయితే దీర్ఘకాలిక రుణాలు తీసుకున్న వారు చెల్లించకపోవడంతో కొత్తవారికి రుణాలు మంజూరు చేయలేకపోతున్నామని, పాలకవర్గ సభ్యులు చొరవ చూపి రుణాలు చెల్లించేలా చూడాలన్నారు. సమావేశంలో అధ్యక్షుడు వెంకట్రామరెడ్డి, సీఈఓ వెంకట్రాములు, ఉపాధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భవాని మందిర్‌లో దేవయజ్ఞం

ఊట్కూరు: మండలంలోని భవాని మందిర్‌లో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా దేవయజ్ఞాన్ని నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, మహామంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం కృష్ణాష్టమి సందర్భంగా డోలారోహణ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు చౌదరి అశోక్, పండిత్ కనకప్పార్య, చంద్రప్రకాష్, గోపాల్‌రావు, వసంత,

పాఠశాలలకు ప్రహరీలేవీ?

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న బడులు
- ఇష్టానుసారంగా పశువుల సంచారం
- ఇబ్బందుల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు



ప్రహరీ లేక మురుగు చేరిన ఒబ్లాపూర్ పాఠశాల (ఫైల్)

మాగనూర్: మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్షణగా ఉండాల్సిన ప్రహరీలు కరువయ్యాయి. దీంతో రాత్రిళ్లు మందుబాబులు పాఠశాలలను అడ్డాగా చేసుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. మండలంలోని మొత్తం 24పాఠశాలలు ఉన్నాయి. అందులో 11కు పైగా పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీలు లేవు. మిగిలిన పాఠశాలలో పడిపోయిన సగం గోడలు, మరొకొన్నిచోట్ల కొంత మేరకు ఒక భాగంలో నిర్మాణాలు చేపట్టి మిగిలిన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ పాఠశాలల ముందే దుర్భరపరిస్థితులు నెలకొంటున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. ప్రధానంగా పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో పాఠశాలలు మూసిన తరువాత గేదేలు, పందులు పాఠశాలలోకి ప్రవేశించి అపరిశుభ్రత వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. అధికారులు స్పందించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, స్థానికులు, విద్యార్థులు కోరుతున్నారు.

విషపురుగులు, కీటకాల సంచారం..

మండలంలోని చాలా పాఠశాలలు గ్రామానికి చివరన ఉన్నాయి. దీంతో పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో విషపురుగులు, కీటకాలు సంచరిస్తున్నాయి. కరోనా కారణంగా ప్రైవేట్ పాఠశాలలు పూర్తిగా మూతపడిపోవడంతో ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం వచ్చింది. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. కానీ విద్యార్థులకు రక్షణ లేకపోవడంతో తల్లిదండ్రులు భయందోళనకు గురవుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం..



పాఠశాలలకు ప్రహరీ లేకపోవడంతో ఉదయం పాఠశాలకు రాగానే మందుబాటిళ్లు దర్శనమిస్తున్నాయి. మధ్యాహ్నభోజన సమయంలో ఇబ్బందులు పడుతున్నాం. సరైనా ఆటస్థలాలు కరువయ్యాయి. అధికారులు స్పందించి ప్రహరీల నిర్మాణం చేపట్టాలి. – తిమ్మన్న, హెచ్‌ఎం మందిపల్లి

ప్రహరీలు నిర్మించాలి..



ప్రభుత్వ పాఠశాలలో పూర్తిస్థాయిలో ప్రహరీల నిర్మాణం చేపట్టాలి. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పాఠశాలలోకి విషపు పురుగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం మండలంలోని అన్నిపాఠశాలలకు ప్రహరీలు నిర్మించాలి. – సాయికేత్, ఎస్ఎఫ్ఐ నాయకుడు

నివేదిక పంపించాం..



ప్రస్తుతం మొదటి విడతలో మండలంలోని కొన్నిపాఠశాలలు మనఊరు–మనబడి కింద పనులు జరిగాయి. త్వరలోనే మండలంలో మిగిలిన అన్నిపాఠశాలలో రెండో విడత మనఊరు–మన బడిలో మౌళిక వసతులు కల్పిస్తాం. – వెంకటయ్య, ఇన్‌చార్జి ఎంఈఓ, మాగనూర్

సమగ్రశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



శిబిరంలో మద్దతు తెలుపుతున్న ఎంఈఓ, జీహెచ్‌ఎంలు

నారాయణపేట రూరల్: సమగ్రశిక్ష ఉద్యోగులు నాల్గోరోజు తమనిరసన వ్యక్తం చేశారు. స్థానిక వివేకానంద మున్సిపల్‌పార్క్ వద్ద శుక్రవారం రిలేదీక్షలో భాగంగా పువ్వులతో 'సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాల'ని నేలపై రాసి నిరసన వ్యక్తం చేశారు. వీరికి మద్దతుగా టీడీపీ నాయకులు, ఎంఈఓలు, జీహెచ్‌ఎంలు సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగభద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని, మహిళలకు ప్రసూతి సెలవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఓంప్రకాష్, ఎంఈఓలు వెంకటయ్య, గోపాల్‌నాయక్, అంజలిదేవి, జీహెచ్‌ఎంలు రమేష్‌శెట్టి, అనంతప్ప, వెంకట్రాములు, పీఈటీ రమణ, జేఏసీ నాయకులు రవిప్రకాష్, ఆరీఫ్‌అహ్మద్, కరీష్మ, ఎల్లగౌడ్, మహిపాల్, శివకుమార్, ఉసేనప్ప పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



నర్వ ఎల్లంపల్లిలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్



మరికల్‌లో..

నర్వ: ఎదిగే పిల్లలకు సంపూర్ణ పోషకాహారం తప్పనిసరిగా అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ అన్నారు. శుక్రవారం పోషణ్‌మాసం సందర్భంగా ఎల్లంపల్లిలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లలకు మంచిపోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తే ఆరోగ్యంతోపాటు ఎదుగుదల ఉంటుందన్నారు. ఆరునెలలు నిండిన పిల్లలకు తప్పకుండా అనుబంధ పోషకాహారం మొదలుపెట్టాలన్నారు. ప్రభుత్వం పిల్లలకు అందించే బాలామృతంలో అన్నిరకాల పోషకాలు సమపాళ్లలో ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, సర్పంచ్ చెన్నయ్య, ఉపసర్పంచ్ నాగరాజు, అంగన్‌వాడీటీచర్ మంజుల తదితరులు పాల్గొన్నారు.

మరికల్: పోషణ్‌మాసం సందర్భంగా మండల కేంద్రంలోని హరిజన్‌వాడ అంగన్‌వాడీలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈమేరకు గర్భిణి, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేశారు. అనంతరం ఎంపీటీసీ గోపాల్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీద్వారా ఇస్తున్న పౌష్టికాహారం ఎంతో శ్రేష్టమైందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బాలమణి పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం



మాట్లాడుతున్న వ్యతిరేక కూటమి సభ్యులు

మక్తల్: పట్టణంలోని వ్యతిరేక కూటమికి చెందిన నాయకులపై ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఇష్టానుసారంగా మాట్లాడితే సహించమని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి, బీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరులతో వారు మాట్లాడారు. కులాల పేరుతో నాయకులను విమర్శించడం తగదన్నారు. మక్తల్ ప్రజల సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తున్నామని.. వచ్చే ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గ ప్రజలే తీర్పు చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్‌యాదవ్, హన్మంతు, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, నీలప్ప, వెంకటప్ప, శివరాంరెడ్డి, మామిళ్ల ఆంజనేయులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక

మరికల్: ఈ నెల 9 నుంచి 11 వరకు నిర్మల్ జిల్లాలో నిర్వహించే సీనియర్ నెట్‌బాల్ పోటీలకు మండలంలోని బాలుర ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు శుక్రవారం హెచ్‌ఎం దత్తాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో కావ్య, చందనా, రాజేశ్వరీ, అవంతిక, మానస, శ్రీకాంత్, రునాథ్, కార్తిక్‌రెడ్డి ఎంపికయ్యారన్నారు. నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను సర్పంచ్ గోవర్ధన్ అభినందించారు.

ధన్వాడ: మండలంలోని కొండాపూర్‌లో గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ రాజారాం, కోచ్ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు.

గ్రామసభల ద్వారా 'గృహలక్ష్మి' లబ్ధిదారులను ఎంపిక చేయాలి



మాట్లాడుతున్న యాదగిరి

నారాయణపేట: గ్రామసభలు నిర్వహించి గృహలక్ష్మి పథకం లబ్ధిదారులను ఎంపిక చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఏఐపీకేఎస్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం జిల్లా కేంద్రంలో భగవంత్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే నిరుపేదలకు రూ.3 లక్షలు ఇస్తామని ప్రకటించిందని, దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ.10 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కేవలం అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు ఇవ్వాలని, బీఆర్ఎస్ పార్టీ ప్రజాతినిధుల ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయడం సరికాదన్నారు. సమావేశంలో ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరెడ్డి, కొండ నర్సింహులు, సహాయ కార్యదర్శి బి.నారాయణ, బాలకృష్ణ, తాయప్ప, వై.రాజు, బాబు, నర్సింహులు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వరినారు పోసి నిరసన



రోడ్డుపై వరి నాటుతు నిరసన తెలుపుతున్న నాయకులు

ధన్వాడ: మండల కేంద్రం నుంచి కోయిల్‌సాగర్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం రోడ్డుపై వరినారుపోసి నిరసన వ్యక్తం చేశారు. పూసల్‌పాడు, గోటూర్, కొండ్రోనిపల్లి గ్రామాలకు కంకరతేలిన రోడ్డుపై ప్రయాణం చేయాల్సి వస్తుందని, ప్రమాదవశాత్తు కిందపడితే ప్రాణాలుపోయే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి రోడ్డుమరమ్మతు పనుల చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కొండన్న, బాలకృష్ణయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు వినాయక ఉత్సవాలపై సమావేశం

నారాయణపేట: విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జనోత్సవాలపై చర్చించేందుకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో సమావేశం ఏర్పాటు చేసినట్లు వీహెచ్‌పీ గౌరవ అధ్యక్షుడు క్యాతన్ రఘునాథ్, అధ్యక్షుడు నర్సింహులు, కార్యదర్శి ప్రవీణ్ కడుదాస్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని హిందూ బంధువులు, పెద్దలు అందరూ పాల్గొని వినాయక చవితి, ప్రతిష్టాపనపై చర్చించి సరైనా నిర్ణయం ఏర్పాటు చేయాలని కోరారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

నారాయణపేట రూరల్: జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సీఐ రవిబాబు సూచించారు. శనివారం నారాయణపేట, కోస్గి కోర్టుల పరిధిలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు, ఇది కక్షిదారులకు చక్కటి అవకాశం అన్నారు. ఉచిత లోక్‌అదాలత్‌లో రాజీపడదగు కేసులు, మోటర్ వెహికల్ యాక్సిడెంట్ కేసులు, విద్యుత్‌చోరీ వినియోగదారులు, తగదాలు, ట్రాఫిక్‌కేసులు, ఇరువర్గాల వారు రాజీపడేందుకు అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందజేత



జిల్లా వైద్యాధికారి శైలజకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఊట్కూర్: మండలంలోని పెద్దపోర్లలో శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందిన ఆశాకార్యకర్త రజిత కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి జిల్లా వైద్యధికారి డాక్టర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మృతురాలి కుటుంబానికి కరోనా ఇన్స్‌రెన్స్ స్కీంలో రూ. 20లక్షలు, అంత్యక్రియలకు రూ. 50వేలు, భర్తకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం మండల కన్వీనర్ శివప్పగౌడ్, బాబులప్ప తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ.. దేశానికే తలమానికం

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

నర్వ: అభివృద్ధిలో తెలంగాణ దేశానికే తలమానికంగా నిలిచిందని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం యాంకిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజచేసి పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకొచ్చి గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి ఎంతో కృషిచేశామన్నారు. గ్రామాల్లో నర్సరీలు, డంపింగ్‌యార్డులు, పల్లెప్రకృతివనాలు, క్రీడాప్రాంగాణాలు, పంచాయతీ భవనాలు, సీసీరోడ్లు, డ్రెయినేజీలు, చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఎంపీపీ జయరాములుశెట్టి, జెడ్పీటీసీ సభ్యురాలు గౌనిజ్యోతి, వైస్ ఎంపీపీ వీణావతి, లక్ష్మన్న, మహేశ్వర్‌రెడ్డి, నాయకులు దండు అయ్యప్ప, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

కృష్ణా: సమాజానికి ఆదర్శవంతులుగా ఉన్న పూలే, అంబేద్కర్‌లను ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా గౌరవించాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి సూచించారు. శుక్రవారం హిందుపూర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన విగ్రహాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదర్శవంతులైన మహానుబాహులు చూపిన మార్గదర్శకంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ పూర్ణిమ, వెంకట్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనమ్మపాటీల్, సర్పంచ్ లక్ష్మీనారాయణగౌడ్, సద్దాంహుసేన్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్తీక్, అనిల్, కోరిమారెప్ప, శివరాజ్‌పాటీల్, రమేష్, అమర్‌కుమార్‌దీక్షిత్, సోమశేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మక్తల్: గ్రామాలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిగండ్లలో రూ. 20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సద్గుణ, ఎంపీటీసీ లక్ష్మీ, సర్పంచ్ మహేశ్వరి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, తిరుపతయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్వ: శ్రీకృష్ణ పరమాత్ముడు ధర్మానికి రక్షకుడని ధర్మాన్ని రక్షించేందుకు ప్రతి యుగంలో జన్మిస్తానని గీతలో చెప్పారని ఎమ్మెల్యే చిట్టెం అన్నారు. శుక్రవారం స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో చేపట్టిన ఉత్సవాలను ఆయన తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సిద్దయ్య, గోకుల్‌సింగ్, రవీందర్‌సింగ్, లక్ష్మన్న, మహేశ్వర్‌రెడ్డి, డా.శంకర్, రాజారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఊట్కూరు: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వెంకటరామారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్ల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని, కనీసవేతనం రూ. 26వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే ఈనెల 11నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణ, నాయకులు శివప్పగౌడ్, ప్రశాంత్, అంగన్‌వాడీ టీచర్లు, ఆనందమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

మద్దూరు: అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని లేనిపక్షంలో ఈ నెల 11నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు వెళ్తున్నట్లు యూనియన్ నాయకులు పుష్ప, జోషి తదితరులు శుక్రవారం తహసీల్దార్ జయరాములుకు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క నీస వేతనం రూ. 26వేలతోపాటు పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత తదితర డిమాండ్ల సాధనకు ఈ సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కవయిత్రి సుష్మకు యువ సాహిత్య పురస్కారం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: మక్తల్‌కు చెందిన కవయిత్రి సుష్మకు కుసుమ ధర్మన్న యువ సాహిత్య పురస్కారం దక్కింది. ఈమేరకు గురువారం రాత్రి హైద్రాబాద్ రవింద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో సుప్రసిద్ధ కవి, సినీగీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, సాహితీవేత్త ఏనుగు నర్సింహారెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో నగదు పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ఉత్తమ పురస్కారం రావడం ఎంతో ఆనందంగా ఉందని, సమాజాన్ని చైతన్య పర్చడంలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : మండలంలోని బండగొండ యూపీఎస్ స్కూల్‌లో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న శంకర్‌నాయక్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. దీంతో శుక్రవారం పాఠశాలలో సర్పంచ్ భీమమ్మ, ఎంపీటీసీ సభ్యులు రేణుక, పంచాయతీ కార్యదర్శి కనకప్ప, ఎస్ఎంసీ చైర్మన్ శివశంకర్ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కిష్టప్ప, రాజు, ఉపాధ్యాయులు సుదర్శన్, పవన్, రవీందర్, సాయి, సౌమ్యపాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని చేగుంట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు నాగబూషణం ఉత్తమ ఉపాధ్యాయుడిగా గుర్తించడంతో శుక్రవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనకు పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలోని మిగితా ఉపాధ్యాయులు వీరిని ఆదర్శంగా తీసుకోని విధులు నిర్వహించాలని, ఇకముందు మరింతమంది ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తింపు పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమనాథ్‌రెడ్డి, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారిణికి సన్మానం



ఉషను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

ఊట్కూరు: మండలంలోని డ్వాక్రా భవనంలో ఓఎంఐఎఫ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దజట్రం గ్రామానికి చెందిన జానపద కళాకారిణి ఉషను సన్మానించారు. ఈమె సీమదసరా చిన్నోడు అనే జానపదపాట యూట్యూబ్ ద్వారా ప్రచారం కావడం జరిగింది. ఈ సందర్భంగా ఓఎంఐఎఫ్ సంస్థ జిల్లా కన్వీనర్ అంజమ్మ మాట్లాడుతూ.. పొట్టకూటికోసం వలసవెళ్లిన ఒంటరి మహిళ యూట్యూబ్‌లలో జానపదపాటలు పాడడం చాలా సంతోషకరమన్నారు. ప్రభుత్వం ఉషను అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ నాయకులు నారాయణ, ఆశమ్మ, లక్ష్మమ్మ, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.